అధికారులను నిలదీసిన ప్రజలు

- రసాభాసగా గ్రామసభలు
- అర్హత ఉన్నా పేర్లు లేవని నిలదీత
- అర్హులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని అధికారుల విజ్ఞప్తి



పాల్వంచరూరల్: బస్వతారక కాలనీలో ఇళ్లు మంజూరు చేయాలని ధర్నా చేస్తున్న మహిళలు

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న సంక్షేమ పథకాల అమలు కోసం కొత్తగూడెంలో మున్సిపాలిటీలో మంగళవారం వార్డు సభలను నిర్వహించారు. ఈ సభల్లో ప్రజలు.. అధికారుల నిలదీతల నడుమ, కొన్నిచోట్ల స్వల్ప ఆందోళనలతో కొనసాగాయి. అధికారులు, ప్రజలకు సర్దిచెప్పడంతో ఆందోళనలు విరమించారు. 5వ వార్డులో అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయించారని ఆరోపిస్తూ స్థానికులు ఆందోళన నిర్వహించారు. అర్హులు దరఖాస్తు చేసుకోవాలని, సర్వే జరిపి న్యాయం చేస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళన విమరించారు.

పథకాలను దూరం చేస్తున్నారు...

బీఆర్‌ఎస్ పాలనలో అందరికి సంక్షేమ పథకాలను అందిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల మధ్య చిచ్చు పెట్టి సంక్షేమ పథకాలను దూరం చేస్తున్నారని కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి ఆరోపించారు. మంగళవారం 6వ వార్డులో జరిగిన వార్డు సభలో అధికారులకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఎన్నిసార్లు రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసిన ఫలితం లేదని, ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందించాలన్నారు.



పాల్వంచ: మాట్లాడుతున్న మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు

చుంచుపల్లి: మండలంలో మంగళవారం నిర్వహించిన గ్రామసభలు కొంత ప్రశాంతంగానే ముగిశాయి. గ్రామసభలతో వివిధ పంచాయతీలతో సందడిగా మారింది. మండలంలో మొత్తం 18 గ్రామ పంచాయతీలు ఉండగా మొదటి రోజు 6 గ్రామపంచాయతీల్లో అధికారులు గ్రామసభలను నిర్వహించారు. ఎన్‌కే నగర్ గ్రామపంచాయతీలో గ్రామసభ కొంత రసాభసగా మారింది. అర్హులకు సంక్షేమ పథకాలు అందలేదని నిలదీశారు. కావాలని కొందరికే అవకాశాలు కల్పించినట్లు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్నారు. చేసేది లేక పలువురు కొత్తగా దరఖాస్తులను సైతం అందజేశారు. ఎంపీఓ సత్యనారాయణ, స్పెషల్ ఆఫీసర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



ఇల్లెందు: మాట్లాడుతున్న చైర్మన్ డీవీ

ఇల్లెందు: ఇల్లెందు మున్సిపాలిటీలో మంగళవారం జరిగిన వార్డు సభల్లో తమ పేర్లు రాలేదని, పలుమార్లు దరఖాస్తులు చేశామని, ఉపాధి హామీ పనులు చేశామని, గ్రామపంచాయతీ నుంచి మున్సిపాలిటీలో కలిశామని, తమను ప్రత్యేకంగా గుర్తించి ఆత్మీయ రైతు భరోసాకు ఎంపిక చేయాలని విన్నవించుకున్నారు. 1వ వార్డు సత్యనారాయణపురంలో జరిగిన గ్రామసభలో ప్రజలు రేషన్ కార్డుల్లో పేర్లు నమోదు కాలేదని అధికారుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం రెండు జాబితాలు ప్రకటించారు. అభ్యంతరాలు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, కమిషనర్ శ్రీకాంత్, డీఈ మురళీ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



ఇల్లెందు: 2వ వార్డులో దరఖాస్తులు అందజేస్తున్న ప్రజలు

ఇల్లెందురూరల్: మండలంలోని 12 గ్రామపంచాయతీలలో మంగళవారం గ్రామసభలు నిర్వహించారు. తొలిరోజు తీవ్రస్థాయిలో అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. రేషన్ కార్డుల జాబితాలో ఎందుకు చేర్చలేదని తిలక్‌నగర్ గ్రామపంచాయతీలో మహిళలు అధికారులను నిలదీశారు. సీఎస్పీ బస్తీలో ఒక్కో ఇంట్లో ఇద్దరు, ముగ్గురికి ఇందిరమ్మ ఇళ్ల అర్హుల జాబితాలో పేర్లు నమోదు చేశారని అభ్యంతరం చెప్పారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులుగా ఉన్న తమకు కూడా తెలియకుండా ఒకే ఇంట్లో కూర్చొని సర్వే చేశారని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ ధన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులోభాగంగా మంగళవారం అధికారులు నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలు పలు చోట్ల రసాభసగా మారాయి. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల మంజూరులో అవకతవకలు జరిగాయని స్థానికులు అధికారులను నిలదీశారు. మండల పరిధిలోని 12 గ్రామపంచాయతీలో మంగళవారం అధికారులు ప్రజాపాలన గ్రామసభలను నిర్వహించారు. పాండురంగాపురంతండాలో అనర్హులకు ఇళ్లు మంజూరు చేశారని స్థానికులు అధికారులను నిర్బంధించారు. కలెక్టర్ వచ్చి సమాధానం చేప్పే వరకు వదలబోమని భీష్మించారు. తహసీల్దార్ వివేక్ అర్హులైన వారికి ఇప్పిస్తామని హామి ఇవ్వడంతో అధికారులను విడుదల చేశారు.

రైతు సంక్షేమానికి పెద్దపీట..

రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. జగన్నాథపురం రైతు వేదికలో మంగళవారం జరిగిన ప్రజాపాలన గ్రామ సభలో కొత్వాల హాజరై మాట్లాడారు. మండల ప్రత్యేకాధికారి తిరుపతిరావు, ఎంపీడీఓ కె.విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీఓ నారాయణ, ఏపీఎం రాంబాబు పాల్గొన్నారు.

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని 12 గ్రామ పంచాయితీలో మంగళవారం ప్రజా పరిపాలన గ్రామసభలు నిర్వహించారు. రేగళ్ల పెద్ద తండాలో ప్రజలు అధికారులను నిలదీశారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ కేఆర్‌వీకే ప్రసాద్, ఎంపీడీవో చలపతి, ఎవో రాకేష్ తదితరులు ఉన్నారు.

జూలూరుపాడు: ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ప్రజాపాలన గ్రామసభలు జరిగాయి. ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల జాబితాల్లో అర్హుల పేర్లు రాలేదని ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల ప్రత్యేక అధికారి రుక్మిణీదేవి, ఎంపీడీఓ డి.కరుణాకర్‌రెడ్డి, తహసీల్దార్ కె.స్వాతిబిందు, ఏఓ దీపక్ ఆనంద్, ఎస్సై రవి పాల్గొన్నారు.

పాల్వంచ: అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం అని రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. ఈనెల 26వ తేదీ నుంచి ప్రభుత్వం అమలు చేయనున్న ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారుల ఎంపికలను మంగళవారం పట్టణంలోని గడియకట్ట, పాత పాల్వంచ, నవభారత్, సీతారాంపట్నం, సబ్ స్టేషన్ ఏరియా, ఒడ్డుగూడెం తదితర ప్రాంతాల్లో వార్డు సభల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడారు. మున్సిపల్ కమిషనర్ కె.సుజాత మాట్లాడుతూ అర్హులైన వారంతా దరఖాస్తులు చేసుకుని సర్వేకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మేనేజర్ ఎల్‌వి.సత్యనారాయణ, డి.స్వరూప రాణి, ఏఈ రాము, టీపీఓ నవీన్ కుమార్, కొండం వెంకన్న, పైడిపల్లి మహేష్ పాల్గొన్నారు.

టేకులపల్లి: మండలంలో గ్రామసభలు మంగళవారం గందరగోళంగా ప్రారంభమయ్యాయి. తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంపీఓ, ఏఓల ఆధ్వర్యంలో ముత్యాలంపాడు క్రాస్‌రోడ్, రాంపురం, చుక్కాల బోడు, రోళ్లపాడు, పెట్రాంచెలక, కుంటల్ల, ఎర్రాయిగూడెం, మొక్కంపాడు, బర్లగూడెం పంచాయతీల్లో గ్రామసభలు జరిగాయి. పలు పథకాలకు అనర్హులను ఎంపిక చేశారంటూ ప్రజలు అధికారులను నిలదీశారు. అధికారులు మాట్లాడుతూ... జాబితాలో పేర్లు లేనివారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బుధవారం బద్దుతండా, పెగళ్లపాడు, బేతంపూడి, గోల్యాతండా, బిల్లుడు తండా, లచ్చగూడెం, కిష్టారం, కొత్తతండా(జి), శంభునిగూడెంలో గ్రామసభలు జరగనున్నాయి.



కొత్తగూడెంఅర్బన్: 5వ వార్డులో అధికారులను నిలదీస్తున్న ప్రజలు



పాల్వంచరూరల్: దంతలబోరులో గ్రామసభ



జూలూరుపాడు: అధికారులను ప్రశ్నిస్తున్న ప్రజలు



టేకులపల్లి: ముత్యాలంపాడు క్రాస్‌రోడ్‌లో అధికారులను నిలదీస్తున్న ప్రజలు





ఇల్లెందురూరల్: మాట్లాడుతున్న తహసీల్దార్ రవికుమార్, మామిడిగుండాలలో గ్రామసభకు హాజరైన ప్రజలు

క్లుప్తంగా

ఓటు హక్కుపై అవగాహన



విద్యార్థులతో ఉపాధ్యాయులు

పాల్వంచ: ఓటు హక్కుపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని బొల్లేరుగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మంగమ్మ అన్నారు. ఈనెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మంగళవారం మండల స్థాయిలో విద్యార్థులకు వకృత్వ, వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. మంగమ్మ మాట్లాడుతూ... ఓటు హక్కును స్వేచ్ఛగా, స్వతంత్రంగా వినియోగించుకోవాలన్నారు. జి.రత్నకుమారి, పి.పుల్లారావు, పూర్ణచందర్‌రావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపునకు కృషి చేయాలి

పాల్వంచరూరల్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ మద్దతు అభ్యర్థుల గెలుపు కోసం ప్రతీ కార్యకర్త కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం కోరారు. నాగారం కాలనీలో మంగళవారం శాఖ మహాసభ నిర్వహించారు. మాట్లాడుతూ.. పేదప్రజల, కష్టజీవుల, కర్షకుల, కార్మికుల పార్టీ సీపీఐ అన్నారు. పార్టీ బలోపేతం కోసం ప్రతీ కార్యకర్త కృషి చేయాలన్నారు. స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని, ప్రతీ పంచాయతీలో సీపీఐకి ప్రాతినిధ్యం వహించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. 15మందితో కూడిన నూతన కమిటీని ఎన్నుకున్నారు. వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, నిమ్మల రాంబాబు, ముత్యాల కిరణ్‌కుమార్, లాల్‌పాషా, వెంకటరమణ, సుంకర రంగారావు, హరియా, కృష్ణ, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీవైఎల్ జిల్లా సహాయ కార్యదర్శిగా సతీష్‌కుమార్



టేకులపల్లి: ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) జిల్లా కమిటీ సహాయ కార్యదర్శిగా టేకులపల్లికి చెందిన తోటకూరి సతీష్‌కుమార్ ఎన్నికయ్యాడు. ఇల్లెందు ఇఫ్టూ కార్యాలయంలో జరిగిన ఉమ్మడి పీవైఎల్ జిల్లా కమిటీల సమావేశంలో నూతన జిల్లా కమిటీని 21 మందితో ఏర్పాటు చేశారు. ఇందులో సతీష్‌ని ఎన్నుకోవడం జరిగిందని పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు మోకాళ్ల రమేష్ తెలిపారు.

రాజ్యాంగాన్ని గౌరవించాలి



మాట్లాడుతున్న రంగాకిరణ్

చుంచుపల్లి: దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సంవిధాన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమాన్ని మంగళవారం కొత్తగూడెంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కేవీ రంగాకిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్రం వచ్చిన 75 సంవత్సరాల్లో బాబాసాహెబ్ అంబేద్కర్‌ను, రాజ్యాంగాన్ని గౌరవించిన పార్టీ ఏదైనా ఉందంటే అది భారతీయ జనతా పార్టీ మాత్రమేనన్నారు. కాంగ్రెస్ పార్టీ 55 ఏళ్ల పరిపాలించినా అంబేద్కర్‌కు ఎటువంటి గుర్తింపు ఇవ్వలేదన్నారు. ఈ కార్యక్రమంలో నన్నే ఉదయ్ ప్రతాప్, కొదమసింహం పాండురగాచార్యులు, పానిశెట్టి వెంకటేశ్వర్లు, తాళం మణికంత, గంధం ప్రసాద్, బండారు చందు, చంద్రరావు, సాయి కిరణ్, భోగి కృష్ణ, రాయుడు నాగేశ్వరరావు, శంకర్ పాల్గొన్నారు.

అధికారులు జోక్యం చేసుకోవాలి

ఇల్లెందు: ఎల్టీఆర్ కేసు నడుస్తున్నా గిరిజనేతరుడు అక్రమంగా ఆ భూమిలో ఇల్లు నిర్మాణం, ఓ డబ్బా నిర్మాణం చేస్తున్నాడని అధికారులు జోక్యం చేసుకుని చర్యలు తీసుకోవాలని తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొగ్గెల రామస్వామి అన్నారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ పీఓకు వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ... విజయలక్ష్మీనగర్‌కు చెందిన సర్వే నంబర్ 588/160/21లో గొగ్గెల ఆదిలక్ష్మికి ఐదు ఎకరాల భూమి ఉంది. ఈ భూమిని సత్యనారాయణపురానికి చెందిన గిరిజనేతరులు తమదేనంటూ నాలుగేళ్లుగా అక్రమించి నిర్మాణాలు చేయబోతున్నట్లు చెప్పారు. ఈ భూమిపై ఎల్‌టీఆర్ కేసు పెండింగ్‌లో ఉంది. ఎల్‌టీఆర్ కేసుల విషయంలో అధికారులు జోక్యం చేసుకోవాలని కోరారు.

క్యాలెండర్లు ఆవిష్కరణ

పాల్వంచ: తెలంగాణ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ (హెచ్82) ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్లను మంగళవారం కేటీపీఎస్ 5,6,7 దశల సీఈలు పి.వెంకటేశ్వరరావు, ఎం.ప్రభాకర్‌రావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ జెన్‌కో అధ్యక్ష, కార్యదర్శులు ఉండేటి జయరాజు, ఆవుల కృష్ణారెడ్డి, ఎండీ.మసూద్, అనిల్‌కుమార్, కేసరి రవీందర్, మహేశ్వరం శ్రీనివాస్, జామ్లా, రాంబాబు, శ్రీను, మొయిన్, శ్రీశైలం, సురేష్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి..



హెల్మెట్లు అందజేస్తున్న డీఎస్పీ రెహమాన్

కొత్తగూడెంఅర్బన్: విద్యార్థులు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ అన్నారు. కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లోని ప్రియదర్శినీ డిగ్రీ కళాశాలలో గంజాయి, డ్రగ్స్ నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గంజాయి సప్లై చేసిన, అమ్మిన, కొన్నవారిపై నిఘా పోలీసుల పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఎన్ఏబీ మధుమోహన్ రెడ్డి, వన్ టౌన్ సీఐ కరుణాకర్, త్రీ టౌన్ సీఐ శివప్రసాద్, ఎస్సై విజయ, సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించాలి..

ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పని సరిగా ధరించాలని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల నేపథ్యంలో కొత్తగూడేనికి చెందిన మాలోత్ అశోక్ ఆధ్వర్యంలో 30 మందికి డీఎస్పీ చేతుల మీదుగా హెల్మెట్లు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడారు. త్రీ టౌన్ సీఐ శివప్రసాద్, ట్రాఫిక్ ఎస్సైలు పాల్గొన్నారు.

ఆటో మోటార్ వర్కర్ల కమిటీ ఎన్నిక



ప్రమాణం చేస్తున్న కమిటీ సభ్యులు

టేకులపల్లి: తెలంగాణ ప్రోగ్రెసివ్ అండ్ మోటార్ వర్కర్ల యూనియన్ (టీయూసీఐ) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నూతన కమిటీని17 మందితో ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా కార్యదర్శి షేక్ యాకూబ్ షావలీ మంగళవారం తెలిపారు. మోటర్ కార్మికుల మహాసభలో మోటర్ యూనియన్‌ను టీయూసీఐలో విలీనం కొరకు తీర్మానించిరు. ఏడుగురు ఆఫీస్ బేరర్లుగా, పదిమంది కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎం.చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా పాయం వెంకన్న, ఉపాధ్యక్షుడిగా ధనసరి రాజేష్, రాయల సిద్దు, సహాయ కార్యదర్శులుగా వేల్పుల రమేష్, కోశాధికారిగా పిల్లి మల్లేష్, కార్యవర్గ సభ్యులుగా గుగులోత్ మదార్, కుక్కమూడి ప్రసాద్, మధు, కీసరి వెంకటేష్, ఆరుగురిని కోఆప్షన్ సభ్యులుగా ఎన్నుకున్నారు.

నేడు రెండు పీవైఎల్ సంఘాల ఐక్యత సభ

టేకులపల్లి: 22న యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలో జరగనున్న రెండు ప్రగతిశీల యువజన సంఘాల విలీన ఐక్యత సభను జయప్రదం చేయాలని జిల్లా సహాయ కార్యదర్శి నోముల భానుచందర్, జిల్లా నాయకులు తోటకూరి సతీష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం విలేకరులతో మాట్లాడారు.

ఏఐటీయూసీ కార్మిక పక్షం

ఇల్లెందు: కార్మికుల హక్కుల కోసం పోరాడే పాలకులను నిలదీసే ఏకైక సంఘం ఏఐటీయూసీ అని కార్మికులకు న్యాయం జరగాలంటే బలమైన కార్మిక సంఘంగా ఉండాలని ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె.సారయ్య అన్నారు. మంగళవారం ఇల్లెందులోని జేకే సివిల్ డిపార్ట్‌మెంట్ వద్ద జరిగిన కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఫిట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సింగరేణి వ్యాప్తంగా కార్మికులకు బ్యాంకు జీతాలు, మెడికల్ సౌకర్యం, పీఎఫ్ రికవరి, సింగరేణి లాభాల్లో వాటా ఇలా అనేక హక్కులు సాధించిన సంఘం తమదేనన్నారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ శంకర్, ఎం.శ్రీనివాస్, పండు, లక్ష్మణ్, రాజలింగం, భావ్‌సింగ్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న దృశ్యం

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం రామవరం టూ ఇంక్లైన్ ఏరియాకు చెందిన బాలిక ప్రమాదవశాత్తు వేడినీటిలో పడి తీవ్రంగా గాయపడింది. చిన్నారికి వైద్య ఖర్చుల కోసం రుద్రంపూర్ జమాతే ఇస్లామి సభ్యులు మంగళవారం రూ.12 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ బాసిత్ మాట్లాడుతూ...

కష్టాల్లో ఉన్న సాటి మనిషికి సాయం చేయడమే నిజమైన దైవభక్తి అని ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం తెలిపారని గుర్తు చేశారు. కులమతాలకు అతీతంగా జమాతే ఇస్లామి హింద్ విద్య, వైద్యం కోసం సాయం చేస్తుందని, నిరుపేద కుటుంబానికి దాతలు ఎవరైనా వైద్యం కోసం సాయం చేయాలని అనుకుంటే సంస్థ సభ్యులను సంప్రదించగలరని కోరారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సేవా విభాగం కార్యదర్శి రహీం, సభ్యులు అబ్దుల్ నజీర్, హాఫీజ్, రబ్బానీ, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఆల్బర్ట్

సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐఎన్‌టీయూసీ చిత్తశుద్ధితో కృషి చేస్తుందని యూనియన్ అనుబంధ సింగరేణి కోల్‌మైన్స్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ లేబర్ యూనియన్ రీజినల్ ఇన్‌చార్జ్ కె.అల్బర్ట్ అన్నారు. సింగరేణి కార్పొరేట్ పరిధిలోని బంగ్లోస్ ఏరియాలో మంగళవారం జరిగిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సింగరేణిలో పనిచేస్తున్న 25వేల మంది కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులకు లాభాల వాటాలో రూ.5వేలు ఇప్పించడానికి కృషి చేసిన ఎస్‌సీఎంఎల్‌యూ జనరల్ సెక్రటరీ, రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్ జనక్‌ప్రసాద్, ఆలిండియా ఐఎన్‌టీయూసీ అధ్యక్షులు డాక్టర్ సంజీవరెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల పెరుగుదల, ఈఎస్ఐ సౌకర్యం, పీఎఫ్ తదితర సమస్యలపై యూనియన్ జనరల్ సెక్రటరీ ధర్మపురి ద్వారా పరిష్కరిస్తామని తెలిపారు. యూనియన్‌లో సభ్యులుగా చేరి బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ పీతాంబరం, సెంట్రల్ కౌన్సిల్ సభ్యులు వీవీఎస్ఎస్ స్వామి, పరమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దోపిడీని అరికట్టాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నవీన్

ఇల్లెందు: ఇల్లెందులో మద్యం వ్యాపారుల దోపిడీ విచ్చలవిడిగా సాగుతోందని, తక్షణం అరికట్టించాలని ఐఎన్‌టీయూసీ నేత పడిదల నవీన్ ఎమ్మెల్యే కోరం కనకయ్యను, ఇల్లెందు సీఐ బత్తుల సత్యనారాయణను కలిసి కోరారు. ఈ మేరకు మంగళవారం వినతిపత్రం అందజేశారు.

చెక్కు అందజేత

ఇల్లెందు: పట్టణంలోని 14 నంబర్ బస్తీకి చెందిన భార్యాభర్తలు సూరజ్ పాసీ – చందా పాసీలు వృత్తి రీత్యా ఫొటోగ్రాఫర్లు. ఇటీవల చందా పాసీ అనారోగ్యంతో మృతి చెందింది. అయితే వీరు రాష్ట్ర ఫొటో, వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘంలో సభ్యులుగా ఉన్నారు. ఈ మేరకు సూరజ్ పాసీకి ఈ ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రూ.1.60 లక్షలు చెక్ అందజేశారు.

కార్తీక్‌కు సన్మానం



కార్తీక్‌ను సన్మానిస్తున్న దృశ్యం

కొత్తగూడెంరూరల్: జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన చీకటి కార్తీక్‌ను అభ్యుదయ కళా సేవా సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మద్దెల శివకుమార్ సత్కరించారు. మంగళవారం చుంచుపల్లి మండలం పొంగులేటి శ్రీనివాస్ క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆళ్ల మురళి, వైవీ శ్రీనివాసరెడ్డి, నాగేంద్రర్ త్రివేది, తోట దేవీప్రసన్న పాల్గొన్నారు.

కేంద్ర బృందం పర్యటన



సీతారాంపురం పల్లె దవాఖానాను సందర్శించిన అధికారులు

కొత్తగూడెంరూరల్: క్షయ వ్యాధిని నిర్మూలించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్త భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న వంద రోజుల నిక్షయ్ షిబీర్‌లో కార్యక్రమంలో భాగంగా ఢిల్లీ నుంచి వచ్చిన బృందం మంగళవారం జిల్లాలోని లక్ష్మీదేవిపల్లి మండలం సీతారాంపురం పల్లె దవాఖానాను సందర్శించారు. జిల్లాలో క్షయ వ్యాధి నివారణ పనితీరుపై పర్యవేక్షించి, సమీక్షించారు. జిల్లాలో క్షయ వ్యాధిగ్రస్తులకు సరైన సమయంలో వైద్యసేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి భాస్కర్ నాయక్, డాక్టర్ బాలాజీ, క్షయ వ్యాధి నివారణ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ విష్ణు తదితరులు ఉన్నారు.

క్షయ వ్యాధిని నిర్మూలిద్దాం..

టేకులపల్లి: క్షయ వ్యాధి నిర్మూలనలో అందరూ భాగస్వాములు కావాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ క్షయ నివారణ విభాగ అధికారి డాక్టర్ విష్ణు, జిల్లా క్షయ నివారణాధికారి డాక్టర్ బాలాజీ నాయక్ పిలుపునిచ్చారు. మంగళవారం సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి కందుల దినేష్ ఆధ్వర్యంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ బద్దుతండా ఆరోగ్య ఉపకేంద్రం పరిధిలోని బద్దుతండా, నంద్యాతండా, మద్దిరాలగుంపు, అబ్బిరెడ్డిగూడెం, తుమ్మలచెలక, అందుగులగూడెం, కుంటల్ల గ్రామాల్లో ఆదివాసీ గిరిజన గ్రామాల ప్రజలకు క్షయవ్యాధి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అనుమానితులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

నేడు మంత్రి పొంగులేటి రాక..



గుండాల రోడ్డులో మంత్రి ప్రారంభించనున్న సెంట్రల్ లైటింగ్

ఇల్లెందు: రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార ప్రసారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇల్లెందు పట్టణంలో బుధవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటలకు లలితాపురం నుంచి కరెంటాఫీస్ వరకు రోడ్డు నిర్మాణ పనులకు, అనంతర రూ.కోటితో నిర్మించిన నిర్మించిన డిజిటల్ గ్రంథాలయాన్ని ప్రారంభించనున్నారు. తరువాత రూ.4 కోట్లతో బుగ్గవాగు సుందరీకరణ పనులకు, 22వ వార్డులో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి, మున్సిపల్ గెస్ట్ హౌజ్‌ను పనులకు శంకుస్థాపన చేయనున్నారు. 5 గంటలకు మున్సిపల్ పాలకవర్గం చివరి మీటింగ్‌లో పాల్గొననున్నారు. అనంతరం పాకాల రోడ్డులో సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభించి, స్విమ్మింగ్ పూల్‌ను పరిశీలిస్తారు. 23వ వార్డులో రూ.1.31 కోట్లతో నిర్మించనున్న ప్రైమరీ హెల్త్ సెంటర్ శంకుస్థాపన, అనంతరం మోడల్ మార్కెట్‌ను సందర్శిస్తారు.

పాలకవర్గానికి ఇదే చివరి సమావేశం...

ఇల్లెందు మున్సిపాల్టీ పాలకవర్గం మరో ఐదు రోజుల్లో తాజాలు మాజీలుగా మారిపోనున్నారు. 2025 జనవరి 27వ తేదీతో పాలకవర్గం పదవీ కాలం ముగుస్తుంది. అధికార పక్షంలోనే ప్రతిపక్షం తయారై పోట్లాటల మధ్యన ఏళ్లు గడిచిపోయాయి.

నాడు బీఆర్‌ఎస్ హవా..

గడిచిన మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ హవా కొనసాగింది. ఇల్లెందు మున్సిపాలిటీలో 24 వార్డుల్లో 32 వేల ఓటర్లు, 50 వేల జనాభా ఉంది. మూడు స్థానాల్లో బీఆర్‌ఎస్ రెబల్స్, చెరో స్థానంలో ఎర్ర జెండాలు నిలిచాయి. గడిచిన ఎన్నికల్లో కాంగ్రెస్, టీడీపీ, బీజేపీ, సీపీఎంలు బోణీ కూడా కొట్టలేదు. 24 వార్డుల్లో మొత్తం 32,002 ఓట్లు ఉండగా 23,600 ఓట్లు పోలయ్యాయి. బీఆర్‌ఎస్ ఏకంగా 19వార్డుల్లో ఏకచక్రాధిపత్యం దక్కించుకోగా పోరాడిన బీఆర్‌ఎస్ రెబల్స్ మూడు స్థానాలకు పరిమితం అయ్యారు. ఇక ఎన్డీ, సీపీఐ చెరో స్థానం దక్కించుకున్నాయి.